

పిల్లలను చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలి

కరీంనగర్ అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పిల్లలను చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి అన్నారు. దత్తత మాసం సందర్భంగాహౌసింగ్ బోర్డ్ కాలనీలోని సంక్షేమ ట్రస్ట్ కపిల్ కుటీర్ శిశు సంరక్షణ కేంద్రంలో దత్తత తీసుకున్న తల్లిదండ్రులకు, దత్తతకు దరఖాస్తు చేసుకున్న వారికి శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి మాట్లాడుతూ దత్తత కోసం జడ్పీ కార్యాలయంలోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సర్పంచ్‌లుగా చేసి సర్వం కోల్పోయాం



అభివృద్ధి చేసి అప్పుల పాలయ్యామని మాజీల ఆవేదన



- నగలు, భూములు తాకట్టు
- చేసిన పనులకు బిల్లులు ఇప్పించాలని వేడుకోలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పంచాయతీ ఎన్నికల పర్వంలో తొలి విడత నామినేషన్లుపూర్తయి మలి విడత ఎన్నికలు జరిగే పంచాయతీల్లో నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన తరుణంలో గ్రామాలు రాజకీయాలతో వేడెక్కాయి. కొత్తగా సర్పంచ్‌లు కాదలచుకున్నవారు నూతనోత్సాహంతో కొనసాగుతుండగా.. అదే గ్రామాల్లో మాజీ సర్పంచ్‌లు మాత్రం తలలు పట్టుకుంటున్నారు. చేసిన అప్పులు తీరేదెలారా.. దేవుడా అంటూ కడుపులో దుఃఖాన్ని దాచుకోలేక కలిసిన వారికి తమ బాధలు చెప్పుకుంటున్నారు. సర్పంచ్‌గా గెలిచినందుకు బాధ్యతగా ఎంతో కొంత అభివృద్ధి పనులు చేసి చూపించాలని, అవకాశం కలిసివస్తే ఆ పునాదులపై మళ్లీ నిచ్చెన్లు వేసుకొని అధికారాన్ని అందిపుచ్చుకోవాలని ఆశించారు.

నిధులు మంజూరయ్యాయని..

ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయని ప్రకటనలు వచ్చాయి. ఎమ్మెల్యేలు, మంత్రులు అదేపనిగా మీడియాలో ప్రచారం చేశారు. దీంతో పోటీపడి తమ గ్రామాల అవసరాలను వారికి వివరించి రోడ్లకు, డ్రైనేజీలకు, సామాజిక భవనాలకు, పాఠశాలలకు, అంగన్‌వాడీ భవనాలకు, ఇతర నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయించు కున్నారు. ఎమ్మెల్యే, మంత్రులతో కలిసి కొబ్బరికాయలు కొట్టించుకొని, రిబ్బన్లు కట్ చేయించుకొని శంకుస్థాపనలు చేయించారు. అప్పోసప్పో తెచ్చి వాటిని పూర్తి చేసిన వారు కొందరైతే, ఇంట్లో ఉన్న డబ్బులు పెట్టి పూర్తి చేసినవారు మరి కొందరు. ఇంట్లో ఆడవాళ్ల నగలు, భూములు తాకట్టు పెట్టి అప్పులు తెచ్చుకొని గ్రామాభివృద్ధి పనులు పూర్తి చేశారు. పనులు పూర్తి చేసేంత వరకు పరుగులు పెట్టించిన ప్రభుత్వం నిధులు

(మిగతా 8వ పేజీలో)

మాజీ సర్పంచ్‌ల అభిప్రాయాలు
8లో..

బంగారం కుదవపెట్టి పనులు చేయించా..

- తాళ్ల విజయలక్ష్మి, మాజీ సర్పంచ్, లక్ష్మీదేవిపల్లి

అధికారుల ఒత్తిడి మేరకు గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు చేశాము. చేతిలో పైసలు లేకుంటే బంగారం కుదవపెట్టి స్మశానవాటిక, సెగ్రిగేషన్ షెడ్డు, సీసీ రోడ్లు వేయించాను. రెండేళ్లు అధికారుల చుట్టూ బిల్లుల కోసం తిరిగా. చివరకు విధిలేక 20 గుంటల వ్యవసాయ భూమి అమ్ముకొని అప్పులు చెల్లించాము. మరి కొన్ని అప్పులు ఉన్నాయి. పదవి పోయాక అప్పు లు ఇచ్చిన వారి వేధింపులతో ఈ యేడాది జూన్‌లో నా భర్త రవి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. నాకు ఎనిమిది లక్షల బిల్లులు రావలసి ఉంది. వెంటనే వాటిని విడుదల చేసి ఆదుకోవాలి.


ఆత్మహత్యకు పాల్పడిన భర్తకు చికిత్స చేయిస్తున్న తాళ్ల విజయలక్ష్మి (ఫైల్)

దేశాయిపేట గ్రామ పంచాయతీ ఏకగ్రీవం

చొప్పదండి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశాయిపేట గ్రామ పంచాయతీ ఏకగ్రీవమయింది. సర్పంచ్‌తో పాటు ఎనిమిది వార్డు స్థానాలకు సింగిల్ నామినేషన్లు దాఖలయ్యాయి. దీతో ఏకగ్రీవ ఎన్నిక లాంఛన ప్రాయమయింది. గ్రామస్తులందరూ మూడు రోజులుగా సమావేశమై సమష్టిగా నిర్ణయం తీసుకొని ఏకగ్రీవం కోసం సర్పంచ్, ఎనిమిది వార్డు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసి సింగిల్ నామినేషన్లను దాఖలు చేయించారు. సర్పంచ్ స్థానాన్ని బీసీ మహిళకు రిజర్వ్ చేయగా అభ్యర్థిగా వడ్లకొండ తిరుమల ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. వార్డు సభ్యులుగా వొడ్నాల శశిధర్, పెరుమాండ్ల పద్మ, కనకం తార, గొడుగు నర్సయ్య, పెరుమాండ్ల రేణుక, సింగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, ఎల్కపెల్లి గంగరాజు, పెరుమాండ్ల శిరీషలు వార్డు స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారు. ఆరో వార్డు స్థానానికి సింగిల్ నామినేషన్ వేసిన సింగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డిని ఉపసర్పంచ్ అభ్యర్థిగా గ్రామస్థులు ప్రకటించారు.

శివాలయ నిర్మాణం కోసం..

దేశాయిపేట గ్రామంలో శివాలయ నిర్మాణం కోసం గ్రామస్తులు గత రెండేళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు రాగా ఆలయ నిర్మాణం కోసం ముందుకు వచ్చినవారిని ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకునేందుకు సమష్టిగా నిర్ణయించారు. అత్యధికంగా విరాళం అందజేసిన వ్యక్తిని సర్పంచ్ అభ్యర్థిగా, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ప్రకటించారు.

ముగిసిన తొలి విడత నామినేషన్లు

- నేడు పరిశీలన...
- 92 సర్పంచ్ పదవులకు 732 నామినేషన్లు
- 866 వార్డు సభ్యుల స్థానాలకు 2,175 నామినేషన్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

జిల్లాలోని తొలి విడత ఎన్నికలు జరిగే ఐదు మండలాల పరిధిలోని 92 గ్రామపంచాయతీల సర్పంచ్, 866 వార్డు సభ్యుల పదవులకు నామినేషన్ల స్వీకరణ ముగిసింది. శనివారం చివరి రోజు కావడంతో పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. సర్పంచు, వార్డు సభ్యుల అభ్యర్థులు తమ అనుచరవర్గంతో వచ్చి నామినేషన్లను దాఖలు చేశారు. మూడు రోజుల్లో సర్పంచ్ పదవులకు 732 నామినేషన్లు దాఖలయ్యాయి. వార్డు సభ్యుల స్థానాలకు మొత్తం నామినేషన్లు 2,175 దాఖలయ్యాయి. అత్యధికంగా గంగాధర మండలంలోని 33 గ్రామ పంచాయతీలకుగాను 266 నామినేషన్లు వేశారు.

- చొప్పదండి మండలంలోని దేశాయిపేట సర్పంచ్‌తో పాటు, ఎనిమిది వార్డులకు సింగిల్ నామినేషన్లు దాఖలయ్యాయి. కరీంనగర్ రూరల్ మండలంలో 23 వార్డులకు, కొత్తపల్లి మండలంలో మూడు వార్డులకు సింగిల్ నామినేషన్లు వచ్చాయి.

రెండో విడతలో 113 పంచాయతీలకు..

రెండో విడతలో చిగురుమామిడి, తిమ్మాపూర్, గన్నేరువరం, మానకొండూర్, శంకరపట్నం మండలాల్లోని 113 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మండలాల పరిధిలో 1046 వార్డులున్నాయి. ప్రతివార్డుకు ఒకటి చొప్పున 1,046 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈనెల 30 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది. డిసెంబరు 2తో నామినేషన్ల స్వీకరణ ముగుస్తుంది. 3న నామినేషన్లను పరిశీలించి అదే రోజు సాయంత్రం 5 గంటల తర్వాత చెల్లుబాటైన నామినేషన్ల అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. 4న సాయంత్రం 5 గంటల వరకు అప్పీళ్లను స్వీకరించి 5వ తేదీ సాయంత్రం 5లోపు వాటిని పరిష్కరిస్తారు. డిసెంబరు 6 మధ్యాహ్నం 3 గంటల్లోపు నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు అవకాశముంటుంది. ఉపసంహరణ గడువు తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. డిసెంబరు 14న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్లను లెక్కించి అదే రోజు ఫలితాలను ప్రకటిస్తారు. వెంటనే ఉపసర్పంచులను ఎన్నుకుంటారు.


కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లిలో రాత్రివేళలో నామినేషన్ వేసేందుకు క్యూలో ఉన్న అభ్యర్థులు


చొప్పదండి మండలం రాగంపేట గ్రామపంచాయతీలో రాత్రివేళ కొనసాగుతున్న నామినేషన్ల స్వీకరణ

విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

- కలెక్టర్ పమేలా సత్పతి
- జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం


విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నూతన అవిష్కరణలను రూపొందిస్తూ సృజనాత్మకతను పెంపొందించుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సమాజానికి మేలు చేసే సైన్స్ ప్రాజెక్టులను రూపొందించాలన్నారు. పది సంవత్సరాలుగా జిల్లా నుంచి సైన్స్ ఎగ్జిబిట్‌లు రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయికి ఎంపిక కావడం గర్వకారణమన్నారు. విద్యార్థులు జిల్లాలోని సైన్స్ మ్యూజియంను సందర్శించాలన్నారు. జిల్లా విద్యాధికారి శ్రీరాంమొండయ్య మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు భాగస్వాములవడం హర్షించదగిన విషయమన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి, బాల శాస్త్ర వేత్తలుగా రూపొందించాడికి ఇన్‌స్పైర్ అవార్డులను అందిస్తూ అధిక నిధులను వెచ్చిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా పరీక్షల బోర్డు కార్యదర్శి ఎస్ భగవంతయ్య, సెక్టోరియల్ అధికారులు కర్ర అశోక్‌రెడ్డి, ఆంజనేయులు, మిల్కూరి శ్రీనివాస్, కృపారాణి, మండల విద్యాధికారి తుమ్మ ఆనందం, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త విషయాలు నేర్చుకున్నాం



- ఎం సాయికిరణ్, తీగలగుట్టపల్లి

జిల్లా స్థాయి బాల విజ్ఞాన ప్రదర్శనలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ ఆల్ మార్క్ ఎగ్జిబిట్‌ను ప్రదర్శించా ము. జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు తయా రు చేసి తీసుకు వచ్చిన ప్రదర్శనల ద్వారా ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నాము.

సైన్స్ ప్రదర్శన విద్యార్థులకు వరం



- ఎం అక్షయ, గీతిక

జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శనలు విద్యార్థులకు వరం. మేము లైఫ్ సైకిల్ ఆఫ్ ఫ్లవరింగ్ ప్లాంట్స్ సైన్స్ ఎగ్జిబిట్‌ను ప్రదర్శించాము. వందలాదిగా విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను తిలకించడంతో పాటు ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నాం. ఇలాంటి ప్రదర్శనలతో విద్యా సంబంధమైన కొత్త విషయాలు తెలుసుకోవచ్చు.

కేసీఆర్ దీక్షతో ఎగిసిన తెలంగాణ ఉద్యమం

- ఎమ్మెల్యే గంగుల కమలాకర్


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోనే కేసీఆర్ దీక్ష చేపట్టడంతో తెలంగాణ ఉద్యమం ఎగిసిపడిందని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో దీక్షా దివస్ శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కమలాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చింది.. అభివృద్ధి చేసింది కేసీఆరేనన్నారు. బీఆర్ఎస్‌ను కనుమరుగు చేయడం ఎవరి తరం కాదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించు కుంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, వీర్ల వెంకటేశ్వర్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్లు ఏనుగు రవీందర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

శాతవాహన యూనివర్సిటీ ఎదుట..

గణేశ్‌నగర్: శాతవాహన యూనివర్సిటీ ఎదుట గ్రంథాలయ మాజీ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో దీక్షా దీవస్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హాజరై కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో దీక్షా దీవస్ ఇన్‌చార్జి చిరుమిల్ల రాకేష్, కార్పొరేటర్లు బండారి వేణు, కర్ర సూర్యశేఖర్, మీర్‌షౌకత్‌అలీ, నేతి రవివర్మ, నయీం, కెమసారం తిరుపతి, మిడిదొడ్డి నవీన్, రుద్ర రాధ, బీఆర్ఎస్వీ కోఆర్డినేటర్ ద్యావ మధుసూదన్‌రెడ్డి, శాతవాహన యూనివర్సిటీ ఇన్‌చార్జి చుక్కా శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి రెండో విడత నామినేషన్లు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

జిల్లాలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్లు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలాల వారిగా నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

- మానకొండూర్: మండలంలో పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మండలంలో 29 గ్రామాలుండగా 56,922 మంది ఓటర్లు ఉన్నారు. మండలంలో 280 వార్డులున్నాయి. మండల వ్యాప్తంగా 12 నామినేషన్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. అన్నారంలో అన్నారం లలితాపూర్, రాఘవాపూర్, చెంజర్లలో చెంజర్ల, పెద్దూరుపల్లి, నిజాయితీగూడెం, దేవంపల్లిలో దేవంపల్లి, కెల్లేడు, పోచంపల్లి గ్రామాల నామినేషన్లు స్వీకరిస్తారు. గంగిపల్లిలో గంగిపల్లి, గట్టుదుద్దెనపల్లిలో గట్టుదుద్దెనపల్లి, వన్నారం, శంషాబాద్, లింగాపూర్‌లో లింగాపూర్, జగ్గయ్యపల్లి, శ్రీనివాస్‌నగర్ అభ్యర్థులు నామినేషన్లు వేయాల్సి ఉంటుంది. కొండపల్కలలో కొండపల్కల, బంజేరుపల్లి, మానకొండూర్‌లో మానకొండూర్, ముంజంపల్లిలో ఖాదర్‌గూడెం, ముంజంపల్లి, ఈదులగట్టెపల్లి గ్రామాల నామినేషన్లు స్వీకరిస్తారు. పచ్చునూర్‌లో మద్దికుంట, పచ్చునూర్, ఊటూర్‌లో వేగురుపల్లి, ఊటూర్, వెల్దిలో రంగపేట, వెల్ది, లక్ష్మీపూర్ గ్రామాలకు చెందిన అభ్యర్థులు నామినేషన్లు వేయాల్సి ఉంటుంది.
- తిమ్మాపూర్: మండలంలో 23 గ్రామ పంచాయతీలున్నాయి. 38,414 మంది ఓటర్లు ఉన్నారు. నామినేషన్ల స్వీకరణకు తొమ్మిది కేంద్రాలను ఏర్పాటు చేశారు. తిమ్మాపూర్‌లో తిమ్మాపూర్, మహాత్మా నగర్, కొత్తపల్లిలో కొత్తపల్లి, రేణికుంట, నల్లగొండలో నల్లగొండ, బాలయ్యపల్లి, మక్తపల్లి, నుస్తులాపూర్‌లో నుస్తులాపూర్, రామకృష్ణ కాలనీ, ఇందిరానగర్ పంచాయతీలకు చెందిన నామినేషన్లు స్వీకరిస్తారు. మన్నెంపల్లిలో మన్నెంపల్లి, పొరండ్ల, లక్ష్మీదేవిపల్లిలో లక్ష్మీదేవిపల్లి, నేదునూర్, గొల్లపల్లి, వచ్చునూర్‌లో వచ్చునూర్, రాంహనుమాన్‌నగర్, జూగుండ్ల పంచాయతీల అభ్యర్థులు నామినేషన్లు వేయాల్సి ఉంటుంది. పర్లపల్లిలో పర్లపల్లి, మొగిలిపాలెం, పొలంపల్లిలో పొలంపల్లి, నర్సింగాపూర్, మల్లాపూర్ పంచాయతీల నామినేషన్లు స్వీకరిస్తారు.
- చిగురుమామిడి: మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఐదు నామినేషన్ స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల ఎంపీడీవో విజయ్‌కుమార్ తెలిపారు. చిగురుమామిడిలో చిగురుమామిడి, లంబాడిపల్లి, సీతారాంపూర్, పీచుపల్లి, ఇందుర్తిలో ఇందుర్తి, ఒగులాపూర్, గునుకులపల్లి, గాగిరెడ్డిపల్లికి చెందిన నామినేషన్లు స్వీకరిస్తారు. సుందరగిరిలో సుందరగిరి, కొండాపూర్, నవాబుపేట, ముల్కనూర్‌లో ముల్కనూర్, రామంచ, ముదిమాణిక్యం, బొమ్మనపల్లిలో బొమ్మనపల్లి, రేకొండ, ఉల్లంపల్లి గ్రామాల అభ్యర్థులు నామినేషన్లు వెయ్యడానికి ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.
- గన్నేరువరం: మండల పరిధిలోని 17 గ్రామాలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణకు అధికారులు ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. గన్నేరువరంలో గన్నేరువరం, చొక్కారావుపల్లి, చాకలివానిపల్లి, యాస్వాడ, హన్మాజిపల్లిలో మైలారం, సాంబాయిపల్లె, హన్మాజిపల్లి నామినేషన్లు స్వీకరిస్తారు. ఖాసింపేటలో మాదాపూర్, పారువెల్ల, ఖాసింపేట, గునుకులు కొండాపూర్‌లో చీమలకుంటపల్లి, గుండ్లపల్లి, గునుకుల కొండాపూర్, గుండ్లపల్లి స్టేజీ, జంగాపల్లిలో గోపాలపూర్, జంగాపల్లి, పీచుపల్లి గ్రామాల అభ్యర్థులు నామినేషన్లు వేయాల్సి ఉంటుంది.
- శంకరపట్నం: మండలంలో 27 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు ఏడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేశవపట్నంలో కేశవపట్నం, అంబాల్‌పూర్, వంకాయగూడెం, కరీంపేట, తాడికల్‌లో తాడికల్, అర్కండ్ల, ఇప్పలపల్లి, చింతగుట్ట, ఏరడపల్లి, కన్నాపూర్‌లో కన్నాపూర్, రాజాపూర్, ధర్మారం గ్రామాల అభ్యర్థులు నామినేషన్లు వేయాల్సి ఉంటుంది. మెట్‌పల్లిలో మెట్‌పల్లి, కల్వల, ఆముదాలపల్లి, లింగాపూర్, మొలంగూర్‌లో మొలంగూర్, గుడాటిపల్లి, నల్లవెంకయ్యపల్లి, మక్తా, ముత్తారం, గద్దపాకలో గద్దపాక, అంబేద్కర్ నగర్, కాచాపూర్, కొత్తగట్టులో కొత్తగట్టు, గొళ్లపల్లి, చింతలపల్లి గ్రామాల నామినేషన్లు స్వీకరిస్తారని ఎంపీడీవో తెలిపారు.

గడ్డి మందు తాగి వివాహిత ఆత్మహత్య

జమ్మికుంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కేశవపూర్‌కు చెందిన పాతకాల విజయరాణి(35) అనే వివాహిత గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. కేశవపూర్‌కు చెందిన పాతకాల కిరణ్ కుమార్‌కు మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణపూర్‌కు చెందిన విజయరాణితో 16ఏళ్ల క్రితం వివాహమైంది. కిరణ్‌కుమార్ పెయింటింగ్ పనిచేస్తున్నాడు. ఆడబ్బులు కటుంబ పోషణకు సరిపోవడం లేదని విజయరాణి తండ్రికి చెప్పుకుంటూ బాధపడేది. దీంతో తల్లిదండ్రులు ఈనెల27న కుమార్తెను చూసేందుకు కేశవపూర్‌కు వచ్చారు. 28న ఉదయంవారు ముందు గదిలో ఉండగా, విజయరాణి వెనుకగదిలో గడ్డిమందు తాగింది. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. విజయరాణికి భర్త, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆమె తండ్రి చంద్రయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తుచేస్తున్నట్లు పట్టణ సీఐ రామకృష్ణగౌడ్ తెలిపారు.

మియాపూర్‌లో ఒకరి ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం మియాపూర్ గ్రామానికి చెందిన కొయ్యడ అరుణ్ శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. కొన్నిరోజుల నుంచి వారి కుటుంబసభ్యుల మధ్య ఇళ్లు, భూముల పంచాయితీలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అరుణ్‌తో పాటు ఆయన భార్య మాజీసర్పంచ్ స్వప్నలపై అరుణ్ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే ఈ విషయంలో తాము కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నామని, అయినా తమను పోలీసులు పిలిపిస్తుండడంతో మనస్తాపం చెందిన తన భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడని అరుణ్ భార్య మాజీసర్పంచ్ స్వప్న వీడియో విడుదల చేసింది. తన భర్త ప్రస్తుతం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్‌ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని ఆయన ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

వ్యాన్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



బోల్తాపడిన ట్రాలీ వ్యాను

పెద్దపల్లి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకల్వల శివారులో ఆర్టీసీబస్సు ట్రాలీవ్యాన్‌ను ఢీకొంది. దీంతో ట్రాలీవ్యాన్ బోల్తాపడగా అందులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపినవివరాల ప్రకారం.. కొలనూర్‌కు చెందిన ట్రాలీ వ్యాన్ మరమ్మతుల నిమిత్తం పెద్దపల్లికి వస్తోంది. పెద్దకల్వల డిగ్రీకళాశాల వద్ద యూటర్న్ తీసుకుంటుండగా కరీంనగర్‌కి వెళ్తున్న బస్ వెనుకనుంచి ఢీకొంది. దీంతోవ్యాన్‌లో ప్రయాణిస్తున్న డ్రైవర్‌వంశీకృష్ణ, రామరాజుకు తీవ్ర గాయాలు కాగా పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. రామరాజు సోదరుడు దీపక్ ఫిర్యాదుమేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

పాలకుర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బసంత్ నగర్ అల్ట్రాటెక్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. ఈసాల తక్కళ్ళపల్లి గ్రామానికి చెందిన తీగల అనిల్‌కుమార్ ద్విచక్ర వాహనంపై బసంత్‌నగర్ బస్టాండ్ నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈక్రమంలో అదుపు తప్పి అల్ట్రాటెక్ కంపనీ గోడకు ద్విచక్రవాహనం ఢీకొని కిందపడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అనిల్‌ను అటుగా వెళ్తున్న స్రవంతి అనే నర్సు సీపీఆర్ చేసింది. అనంతరం అతన్ని 108లో కరీంనగర్ తరలించారు.

ఒకరిపై పోక్సో కేసు నమోదు

సుల్తానాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. ఓ మైనర్ బాలికను ఒకవ్యక్తి(వివాహితుడు)లోబరుచుకుని కొంతకాలంగా శారీరకంగా ఉపయో గించుకున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు శనివారం పోక్సో కేసు నమోదు చేసినట్లు సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. కాగా ఆవ్యక్తిపై గతంలోకూడా ఓచిన్నారి మృతికేసులో అనుమానాలు వ్యక్తమయ్యాయి. శనివారం కులపెద్దల వద్ద ఈ విషయం వెలుగుచూడగా బాలిక తరపువారు పోలీసులను ఆశ్రయించడంతో సదరు వ్యక్తిపై పోలీసులు పోక్సోకేసు నమోదు చేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



చింతకుంటలో దగ్ధమవుతున్న గుడిసె

కథలాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం చింతకుంటలో శనివారం షార్ట్‌సర్క్యూట్‌తో వేముల శంకర్ అనే వ్యక్తికి చెందిన గుడిసె దగ్ధమైంది. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. భారీగా అగ్నికీలలు ఎగిసిపడడంతో ఫైరింజన్ వచ్చి మంటలు ఆర్పివేసింది. ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, బట్టలు పూర్తిగా కాలిపోయాయి. సంఘటనా స్థలంను రెవెన్యూఅధికారులు పరిశీలించారు. కాగా బాధితకుటుంబానికి పలువురు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కోల్‌సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని గోదావరిఖని వన్‌టౌన్‌సీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. శనివారం రాత్రి విఠల్‌నగర్‌లో పోలీస్‌కళాబృందం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్‌వంటి మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఎవరైనాగంజాయి అమ్మినా, కొన్నా సమాచారం ఇవ్వాలని కోరారు. కాలనీల్లో స్వీయ భద్రత కోసం కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకుల పేరుతో వచ్చే నకిలీ కాల్స్ లింకులు, ఓటీపీ మోసాల గురించి స్పష్టంగా ఉండాలని, మోసాలకు గురైతే వెంటనే 1930నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్, రోడ్డు ప్రమాదాలు, గంజాయి, సైబర్‌మోసాలు, మైనర్ల డ్రైవింగ్‌పై కళాజాత బృందం ప్రజలకు అవగాహన కల్పించింది. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్‌ఐ అనూష, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

నేటితో ముగియనున్న గడువు

- రేపటి నుంచి కొత్త మద్యం దుకాణాలకు అనుమతి
- డిపో నుంచి మద్యం కొనుగోలుకు అనుమతి



కరీంనగర్ క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు నడుస్తున్న వైన్‌షాపు(ఏ4)ల లైసెన్స్ గడువు ఆదివారంతో ముగియనుంది. సోమవారం (డిసెంబరు 1) నుంచి కొత్త వైన్‌షాపులు అమ్మకాలు సాగించేందుకు 94 లైసెన్సీలకు అనుమతులను జారీ చేశామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి శ్రీనివాసరావు తెలిపారు. 2025 డిసెంబరు 1 నుంచి 2027 నవంబరు 30 వరకు రెండేళ్ల కాలంపాటు మద్యం అమ్మకాలు సాగించేందుకు అక్టోబరు 23న లాటరీ ద్వారా లైసెన్సీలను ఖరారు చేశారు. డిసెంబరు 1 నుంచి వైన్‌షాపుల్లో కొత్తగా లైసెన్స్‌లు పొందిన వ్యాపారులు మద్యం అమ్మకాలు సాగించేందుకు అనువుగా ఆదివారం కరీంనగర్ డిపో నుంచి మద్యం కొనుగోలుకు అనుమతులు ఇచ్చారు. ఆది వారం సెలవు దినం అయినా నెలాఖరు కావటంతోపాటు కొత్తగా ఏర్పాటు చేసు కున్న వైన్‌షాపులకు మద్యం సరఫరా చేసేందుకు మద్యం డిపో తెరచి ఉంచుతారు.

ఎక్సైజ్ ఫీజు.. బ్యాంకు గ్యారెంటీలు

మద్యం షాపుల లైసెన్స్‌లు ఖరారు అయిన తరువాత 94 వైన్‌షాపులకు ఏడాదికి 55 కోట్ల 45 లక్షల రూపాయలు లైసెన్స్‌ఫీజుకాగా ఇందులో 6వ వంతు ఎక్సైజ్ ఫీజు 9 కోట్ల 24 లక్షల 17 వేల రూపాయలు లైసెన్స్‌దారులు ప్రభుత్వానికి చెల్లించారు. ఈ మేరకు ఎక్సైజ్ అధికారులు 94 వైన్‌షాపుల లైసెన్సీలకు మొదట కన్ఫర్‌మేషన్ లెటర్లు అందజేశారు. మిగతా లైసెన్స్‌ఫీజుకు 25 నెలల వాలిడిటీతో బ్యాంక్ గ్యారంటీలు ఎక్సైజ్ సూపరింటెండెంట్లకు సమర్పించారు. వైన్‌షాపు ఏర్పాటు కోసం వచ్చిన దరఖాస్తుల ఆధారంగా షాపు స్థలాన్ని ఎక్సైజ్ అధికారులు పరిశీలించారు. నిబంధనల ప్రకారం గుడి, బడికి వంద మీటర్ల దూరం, జాతీయ రహదారికి 220 మీటర్ల దూరం, షాపునకు ఆనుకుని వంద మీటర్ల విస్తీర్ణంలో పర్మిట్ గది, తాగునీరు, మూత్ర శాలలు, పార్కింగ్, సీసీ కెమెరాలు ఉన్నాయని నిర్ధారించిన తరువాతనే 94 వైన్‌షాపులకు లైసెన్స్‌లను జారీ చేశారు. ఈ ప్రక్రియ శనివారంతో ముగిసింది. నవంబరు 30 రాత్రి 10 గంటలతో పాత షాపుల గడువు ముగియనుండగా ఆ షాపులకు సంబంధించిన మిగిలిపోయిన మద్యం స్టాక్‌ను డిపోకు అప్పగించాల్సి ఉంటుంది.

- కరీంనగర్ జిల్లాలో ప్రస్తుతం 94 వైన్‌షాపుల లైసెన్స్‌లు ఖరారు కాగా ఎక్సైజ్ శాఖకు ఏడాదికి 55 కోట్ల 45 లక్షల ఆదాయం సమకూరనున్నది. 11 వైన్‌షాపులకు 50 లక్షల వంతున 5.5 కోట్లు, మరో 40 వైన్‌షాపులకు 55 లక్షల వంతున 22 కోట్లు, 43 వైన్‌షాపులకు 65 లక్షల వంతున 27.95 కోట్ల రూపాయలు లైసెన్స్‌ఫీజు కింద సమకూరనున్నది. ఈ 94 వైన్‌షాపులు 5 లక్షల వంతున 4.7 కోట్ల రూపాయలు స్పెషల్ ఎక్సైజ్ టాక్స్‌తోపాటు, దరఖాస్తు ఫీజు రూపంలో 81.9 కోట్ల రూపాయలు, మొత్తం కలిసి మొదటి ఏడాదిలో 142.05 కోట్ల ఆదాయం సమకూరింది.

కొత్తవారికి గుడ్‌విల్‌ఇస్తూ..

కరీంనగర్ జిల్లాలో 94 వైన్‌షాపుల్లో 25 శాతం షాపులు కొత్తవారికే రావడంతో ఆ షాపులను చాలావరకు మద్యం వ్యాపా రులు లక్షల్లో గుడ్‌విల్ చెల్లించి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఒక్కో వైన్‌షాపు డిమాండ్‌ను బట్టి 50 లక్షల నుంచి కోటి రూపాయల వరకు గుడ్‌విల్ చెల్లింపులు జరిగినట్లు సమాచారం. కొత్తగా వైన్‌షాపులు పొందినవారికి అడ్డాలు లభించక కొంత ఇబ్బంది పడ్డారు. మరి కొందరు తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకున్నారు.

మావోయిస్టు నేత కాశీరాం లొంగుబాటు

- 1989లో భార్యతో సహా ఉద్యమంలోకి..



సింగర్రావుపేట గ్రామంలోని కాశీరాం ఇల్లు

రాయికల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం సింగర్రావుపేట గ్రామానికి చెందిన మావోయిస్టు నేత బత్తుల కాశీరాం మహారాష్ట్ర పోలీసుల ఎదుట శుక్రవారం లొంగిపోయాడు. మావోయిస్టు ఉద్యమానికి ఆకర్షితులైన బత్తుల కాశీరాం, అతని భార్య మల్లవ్వలు ఇద్దరు కుమారులను విడిచిపెట్టి ఉద్యమంలోకి వెళ్లారు. మల్లవ్వ అనారోగ్యంతో ఉద్యమంలో ఉన్న సమయలోనే 2009లో చనిపోయింది. రాయికల్ మండలం సింగర్రావుపేట గ్రామానికి చెందిన బత్తుల పెద్ద రాజయ్య-పెద్ద గంగవ్వ దంపతులకు ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. ఇందులో పెద్ద కుమారుడైన కాశీరాం మావోయిస్టు ఉద్యమానికి ఆకర్షితుడై భార్య మల్లవ్వతో కలిసి 1989లో మావోయిస్టు ఉద్యమంలో చేరాడు. కాశీరాం, మల్లవ్వలు ఉద్యమంలో చేరే సమయంలో ఇద్దరు కుమారులు ఐదేళ్ల వయస్సు గల పిల్లలు.

ఇద్దరు చిన్న పిల్లలను వదిలి కాశీరాం దంపతులు ఉద్యమం బాట పట్టారు. అప్పటి నుంచి ఉద్యమంలో వివిధ హోదాల్లో వీరిద్దరూ పని చేశారు. ఉద్యమంలో ఉన్నసమయలో కాశీరాం తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పలుమార్లు పిల్లల కోసమైనా జనజీవన స్రవంతిలో కలవాలని వేడుకున్నా వారు ఉద్యమాన్ని విడిచిరాలేదు. ప్రస్తుతం కాశీరాం పెద్ద కుమారుడు రాజేష్ హైదరాబాద్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తుండగా, అతని చిన్న కుమారుడు మహేష్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. మహారాష్ట్ర పోలీసులకు కాశీరాం లొంగిపోయాడన్న సమాచారం మేరకు అతడి తమ్ముడు మహదేవయ్య మహారాష్ట్రకు వెళ్లాడు.

పోలీసుల అదుపులో చోరీకి పాల్పడిన యువకుడు?

- యువకుడికి ఫిట్స్.. ఆసుపత్రికి తరలింపు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్‌లో ట్రాలీ ఆటోను దొంగిలించిన అదే గ్రామానికి చెందిన యువకుడిని శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సమాచారం. విచారిస్తున్న క్రమంలో యువకుడికి ఫిట్స్ వచ్చి ఒక్కసారిగా కింద పడిపోయాడని తెలిసింది. ఆందోళనకు గురైన పోలీసులు పోలీస్ వాహనంలో మండల కేంద్రంలోని ఓ ఆసుపత్రికి తరలించారని సమాచారం. ఈ విషయంపై ఎస్‌ఐ రాహుల్‌రెడ్డిని వివరణ కోరగా వాహనం ఎత్తుకెళ్లారని బాధితులు తమ వద్దకు వచ్చారని పేర్కొన్నారు. బాధితుల సమీప బంధువు చోరీ చేయడంతో అతన్ని అదుపులోకి తీసుకుని మాట్లాడుతున్న క్రమంలో ఫిట్స్ రావడంతో అతని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లారని ఎస్‌ఐ వివరించారు.

తల్లీకొడుకులకు కన్నీటి వీడ్కోలు

- చితికి నిప్పుపెట్టిన కుమార్తెలు

తంగళ్లపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు పాల్పడిన తల్లీ కొడుకులకు బంధువులు, మిత్రులు కన్నీటి వీడ్కోలు పలికారు. ఆత్మహత్యకు పాల్పడిన తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన మంచికట్ల లలిత ఆమె కుమారుడు అభిలాష్ అంత్యక్రియలు శనివారం నిర్వహించారు. తల్లి కొడుకుల మృతదేహాలను ట్రాక్టర్‌పై పక్కపక్కనే పెట్టి అంతిమయాత్ర చేపట్టగా దారి వెంట స్థానికులు కంటతడి పెట్టుకున్నారు. తల్లి లలిత చితికి పెద్ద కూతురు మౌనిక నిప్పుపెట్టగా, అన్నయ్య అభిలాష్ చితికి సోదరి మానస నిప్పుపెట్టింది. ఈ దృశ్యం బంధువులను, మిత్రులను కంటతడి పెట్టించింది.



అభిలాష్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న బెటాలియన్ కమాండెంట్ సురేష్

- నివాళులర్పించిన కమాండెంట్..

తంగళ్లపల్లిలో అభిలాష్ భౌతికాయానికి 17వ బెటాలియన్ కమాండెంట్ సురేష్‌తోపాటు కానిస్టేబుళ్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లడుతూ విధి నిర్వహణలో నిబద్ధతతో, క్రమ శిక్షణతో పనిచేసిన సిబ్బందిలో అభిలాష్ ఒకరిగా నిలిచారని కొనియాడారు. ఆయన మృతి పోలీస్‌శాఖకు తీరనిలోటని పేర్కొన్నారు. అనంతరం అభిలాష్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

పథకం ప్రకారమే సిద్ధన్న హత్య

- ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి



హత్యకేసులో అరెస్ట్ అయిన సంతోష్

వేములవాడ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలంలోని గుర్రవానిపల్లె ఎదురుగా ఉన్న అగ్రహారం గుట్టల్లో ఈ నెల 27న బల్లెపు నర్సయ్య అలియాస్ సిద్ధన్న హత్యకేసులో ప్రధాననిందితుడైన జక్కుల సంతోష్‌ను అరెస్ట్‌చేసినట్లు వేములవాడ ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలప్రకారం... జిల్లాలోని తంగళ్ల పల్లిమండలం గండిలచ్చపేట గ్రామానికి చెందిన సిద్ధన్న అప్పటి పీపుల్స్‌వార్ దళ కమాండర్‌గా పనిచేశాడు. ఈసమయంలో వీర్నపల్లి బస్టాండ్‌వద్ద 1999లో జక్కుల అంజయ్యను పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా భావించి కాల్చివేసిన ఘటనలో అతనిపై ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ ఘటనపై అంజయ్య కుమారుడు జక్కుల సంతోష్ తనతండ్రిని చంపిన వ్యక్తిపై కక్షపెంచుకున్నాడు. దీంతో పథకం ప్రకారం సిద్ధన్నపై రాళ్లతో దాడిచేసి హత్యచేశాడు. ఈ ఘటనపై వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో సంతోష్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తుచేపట్టగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఇంచార్జి డిఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. ఈ హత్య కేసును చేధించిన వేములవాడటౌన్ సిఐ వీరప్రసాద్, ఎస్‌ఐ రామ్మోహన్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

రాజన్న కోడెల తరలింపుపై విచారణకు ఈవో ఆదేశం

వేములవాడ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గతఏడాది జనవరిలో రాజరాజేశ్వర స్వామి దేవస్థానం తిప్పాపూర్ గోశాల నుంచి నాలుగు కోడెలను అక్రమంగా తరలించిన వ్యవహారంలో విచారణ చేపట్టాలని శనివారం ఆలయఈవో రమాదేవి అధికారులను ఆదేశించారు. వేములవాడ దేవస్థానం గోశాలనుంచి మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని దుబ్బతండాకు చెందిన సోమేశ్వర గోసంరక్షణ సేవాసంఘం ఆధ్వర్యంలో వ్యాన్‌లో కోడెలను తరలిస్తుండగా జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ వద్ద అక్రమంగా తరలిస్తున్నారని బజరంగ్‌దళ్ కార్యకర్తలు ఆపేశారు. ఈ వాహనాన్ని కార్యకర్తలు తనిఖీచేసిన సందర్భంలో 24కోడెలు ఉన్నాయి. అయితే అనుమతి మాత్రం 20కోడెలకే ఉండడంతో మరో 4కోడెలు ఎక్కడివని బజరంగ్‌దళ్ కార్యకర్తలు ప్రశ్నించారు. అదనంగా నాలుగు కోడెలు ఉండడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా అక్కడ కేసు నమోదైంది. అదే సమయంలో ఇద్దరు ఆలయ ఉద్యోగులకు చార్జి మెమో జారీకి తదుపరి చర్యలకు ఆదేశించారు. ఈ వ్యవహారంలో శాఖాపరమైన సమగ్రవిచారణ చేపట్టాలని ఏఈవోను విచారణాధికారిగా నియమిస్తూ ఈవో ఆదేశాలు జారీచేశారు.

16 మంది బైండోవర్

కరీంనగర్ క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న వారితోపాటు గతంలో ఎన్నికల కేసులున్న పాత నేరస్థులు, సస్పెక్ట్‌షీటర్లు 16మందిని శనివారం బైండోవర్‌చేశామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. 4 కేసుల్లో 16మందిని స్థానిక తహసీల్దార్ ఎదుట హాజరు పరిచినట్లు, లక్షరూపాయల చొప్పున సొంత పూచీకత్తుపై బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన అడిషనల్ డీసీపీ

జమ్మికుంట రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంభునపల్లి శివారులో శుక్రవారం గుర్తుతెలియని మృతదేహం లభించిన సంఘటనస్థలాన్ని అడిషనల్‌డీసీపీ వెంకటరమణ శనివారం పరిశీలించారు. 30-35సంవత్సరాల వయస్సు యువకుడిని హత్యచేసి గోనె సంచులు, చద్దర్లలోచుట్టి రోడ్డుపక్కన పత్తిచేనులో పడేశారు. యువకుడిని గుర్తించేందుకు అతడు ధరించిన దుస్తులు, చెవిపోగు, చేతికి కంకణాలు ఇతర ఆనవాళ్లను రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు పంపించినట్లు తెలిసింది. హత్య ఘటన వెలుగు చూడకముందు ఆ రోడ్డులో పెళ్లి భారత్‌లు జరిగాయని, పరిమల సొసైటీ రోడ్డులో నిత్యం అర్ధరాత్రివరకు ఆకతాయిలు మద్యం తాగుతారని స్థానికులు తెలిపారు. డీసీపీవెంట హుజూరాబాద్ ఏసీపీమాధవి,సీఐ రామకృష్ణగౌడ్ ఉన్నారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వ్యవసాయ బావి మోటారు వైర్ చోరీ

వీణవంక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగాపూర్ వంగల కొండాల్‌రెడ్డికి చెందిన వ్యవసాయ బావి వద్ద స్టాటర్‌తోపాటు మోటర్‌వైరును శనివారం దొంగలు ఎత్తుకెళ్లారు. తరచూ మోటార్ల కాపర్‌వైర్ ఎత్తుకెళ్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కోరుట్లలో రెండిళ్లలో చోరీ



దొంగలు ధ్వంసం చేసిన బీరువా

కోరుట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని రవీంద్ర రోడ్డులో శుక్రవారం రాత్రి తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో చోరీ జరిగింది. సీసీ పుటేజీలకు ఉన్న వైర్లను తొలగించి దొంగలు ఇండ్లలో చొరబడి దొంగతనం చేశారు. రవీంద్ర రోడ్డులో నివాసం ఉంటున్న కటకం రాజారాం దంపతులు గురువారం ఇంటికి తాళంవేసి బంధువుల ఇంటికి వెళ్లి శనివారం ఉదయం తిరిగిరాగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రెండున్నర తులాల బంగారు అభరణాలు రూ. 25అపహరణకు గురయినట్లు బాధితుడు తెలిపాడు. అదేకాలనీకిచెందిన ఇలుటపు భూమయ్య తన చిన్న కుమారుడి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద కుమారుడి ఇంటి వద్ద నిద్ర పోయాడు. ఇంటి ముందర ఉన్న సీసీకెమెరా వైర్లను కట్‌చేసి దుండగులు ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. భూమయ్య ఉదయం చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉన్న విషయం కుటుంబసభ్యులతో పాటు పోలీసులకు సమచారం అందించారు. ఇంట్లోని బీరువాలోఉన్న రెండుతులాల బంగారు అభరణాలు, మూడుతులాల వెండిఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ చిరంజీవి కేసునమోదు చేసి క్లూజ్‌టీంతో తనిఖీలు నిర్వహించారు. కాగా కత్తులతో ముగ్గురుదొంగలు ఆ ప్రాంతంలో సంచారం చేస్తునట్లు పోలీసులు సీసీపుటేజ్ ద్వారా గుర్తించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మల్లాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతారం గ్రామ శివారులో పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శనివారం పట్టుకున్నారు. శనివారం చిట్టాపూర్ గ్రామశివారులో చేపట్టిన తనిఖీల్లో అక్రమంగా రవాణా చేస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.



చిట్టాపూర్ శివారులో పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్లు

మద్యం పట్టివేత

ఇల్లందకుంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతంపేటకు చెందిన బోయిని అశోక్ వద్ద నిల్వ ఉన్న రూ.27వేల విలువైన మద్యాన్ని శనివారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. సీతంపేటలో తనిఖీలు నిర్వహిస్తుండగా, గ్రామానికి చెందిన అశోక్ మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందింది. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు, అతడిపై కేసునమోదు చేసినట్లు ఎస్సైక్రాంతికుమార్ తెలిపారు.

కథల పోటీలో 'మూఢనమ్మకాలు'కు చోటు



విద్యార్థినిని అభినందిస్తున్న ఎంఈవో ప్రభాకర్

ధర్మారం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో నిర్వహించిన కథల పోటీలో నర్సింహులపల్లి విద్యార్థి రాసిన "మూఢ నమ్మకాలు" కథకు చోటు దక్కింది. బాలల దినోత్సవం సందర్భంగా చిల్డ్రన్స్ ఎడ్యు కేషనల్ అకాడమీతోపాటు బాలచెలిమి పిల్లల మాసపత్రిక జాతీయ స్థాయి కథల పోటీలు నిర్వహించారు. ఇందులో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 714మంది తాము రాసిన కథలను పోస్ట్‌ద్వారా పంపగా, 16ఉత్తమ కథలను ఎంపికచేశారు. ఎంపికైన 16ఉత్తమ కథల్లో మండలంలోని నర్సింహులపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న గంగారపు శృతి రాసిన మూఢనమ్మకాలు కథకు చోటుదక్కింది. ఎంపికైన 16మంది విద్యార్థులకు డిసెంబర్ 22న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో నగదు బహుమతితోపాటు షీల్డ్, ప్రశంసాపత్రం అందజేయనున్నారు. ఉత్తమ కథలను పుస్తకరూపంలో తీసుకురానున్నట్లు నిర్వాహకులు మణికొండ వేదకుమార్, గరిపెల్లి అశోక్ తెలిపారు. పిల్లలు రచనలు చేసేలా కృషిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయులు కందుకూరి భాస్కర్‌ను ఎంఈవో పి ప్రభాకర్ అభినందించారు. విద్యార్థి శృతిని ఉపాధ్యాయులు రమేష్, నరేందర్, ఆంజనేయులు, పుష్పలత, శ్రీనివాస చక్రవర్తి, రామ చంద్రారెడ్డి, సతీష్ కుమార్, సీఆర్పీ శ్రీలత అభినందించారు.

ఆర్చరీలో చికితకు గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్‌తో చికిత

ఎలిగేడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన తానిపర్తి చికిత ఖేలో ఇండియా ఆర్చరీలో గోల్డ్ మెడల్ సాధించింది. రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో ఖేలో ఇండియాలో భాగంగా యూనివర్సిటీ స్థాయిగేమ్స్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన ఆర్చరీ పోటీల్లో ఆమె బంగారం పతకం సాధించి, రాష్ట్రానికి, జిల్లాకు పేరు తీసుకు వచ్చింది. ఈ మేరకు ఎమ్మెల్యే విజయరమణరావు బంగారం పతకం సాధించిన చికితను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, మాజీసర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, ఎలిగేడు మాజీ ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావుతోపాటు పలువురు గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తూ చికితను అభినందనలతో ముంచెత్తారు.

ఇండియన్ నేవీ సబ్ లెఫ్టినెంట్‌గా గంభీరావుపేట యవకుడు



నిహాంత్‌గౌడ్

గంభీరావుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన నిహాంత్‌గౌడ్ అనే యువకుడు ఇండియన్ నేవీ సబ్‌లెఫ్టినెంట్‌గా ఎంపికయ్యాడు. విశాఖపట్నంలో శనివారం నిహాంత్‌గౌడ్ విధుల్లో చేరారు. నిహాంత్‌గౌడ్ 6వతరగతి నుంచి ఇంటర్‌వరకు కోరుకొండ సైనిక్‌స్కూల్‌లో విద్యనభ్యసించాడు. ఇంటర్ పూర్తిచేశాక పూణేలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ మూడేళ్లపాటు శిక్షణ పొందాడు. తరువాత ఇండియన్ నేవల్ అకాడమీలో ఏడాదిపాటు శిక్షణ తీసుకున్నాడు. తాజాగా ఇండియన్ నేవీ సబ్‌లెఫ్టినెంట్‌గా ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భంగా నిహాంత్‌ను తల్లిదండ్రులు, బంధువులు అభినందించారు. గంభీరావుపేటలో తన స్నేహితులు ఆనందం వ్యక్తం చేశారు.

హుజూరాబాద్ ఏసీపీ కార్యాలయం తనిఖీ

హుజూరాబాద్, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏసీపీ కార్యాలయాన్ని అడిషనల్ డీసీపీ వెంకటరమణ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డుల నిర్వహణ తీరును పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. చల్లూర్ వంటి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఇటీవల జమ్మికుంట ప్రాంతంలో జరిగిన హత్య కేసు దర్యాప్తు పురోగతిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏసీపీ మాధవి, సీఐ కరుణాకర్ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ వెంకటరమణ

లెక్క దాటొద్దు..

- ప్రతి పైసా లెక్క చెప్పాల్సిందే
- ప్రచారంపై నిరంతరం నిఘా కన్ను
- మండలాల వారీగా వ్యయపరిశీలకుల నియామకం
- ఎంసీసీ అమలుకు పకడ్బందీగా చర్యలు



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పంచాయతీ ఎన్నికల పోరుకు తెరలేచింది. తొలి విడత నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఆదివారం రెండోవిడత మొదలైంది. నామినేషన్లు దాఖలు నుంచి అభ్యర్థులు ఖర్చులకు వెనుకాడకుండా గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తుంటారు. ఎన్నికల్లో అభ్యర్థులు ఖర్చుపెట్టే ప్రతి పైసా లెక్క చెప్పాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం మాత్రం ఖర్చు పరిమితిపై నిఘా పెట్టింది. ఎన్నికల ప్రచార ఖర్చుకు పరిమితి, నిబంధనలను రూపొందించింది. పరిమితికి మించి ఖర్చు చేసే అభ్యర్థులపై వేటు తప్పదు. ఇందు కోసం అభ్యర్థుల ఖర్చుల పరిశీలనకు మండలాల వారీగా వ్యయపరిశీలకులను నియమించారు. ఎన్నికలను పార్టీలు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నాయి. దీంతో ధన, పలుకుబడి ఉన్న అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. వీరితో పాటు పార్టీలకు సంబంధం లేని వారు కూడా అనేకమంది బరిలోకి రావడానికి సిద్ధమవుతున్నారు. పోటీ చేసే అభ్యర్థులు మాత్రం ఎన్నికల సంఘం విధించిన ఖర్చు పరిమితికి లోబడే ఉండాలి.

• సర్పంచ్‌కు రూ. 1.5లక్షల నుంచి రూ 2.5 లక్షలు

ఐదు వేల జనాభాలోపు గ్రామాల్లో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థి రూ1.50 లక్షలు, వార్డు సభ్యుడు రూ 30 వేలు, 5 లక్షలపైగా ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థి రూ 2.50 లక్షలు, వార్డు సభ్యుడు రూ 50 వేలు ఖర్చు పరిమితి ఉంది. ఎన్నికల సామగ్రికి లెక్క ఉంది ప్రచారానికి ఉపయోగించే సామాగ్రికి లెక్క ఉంది. 76 రకాల సామగ్రికి రేట్లు ఎన్నికల సంఘం నిర్ణయించింది. రోజుకు లౌడ్ స్పీకర్ అద్దె 100 వాట్స్ రూ.500, 200 వాట్స్‌కు రూ 1300, డీజేకు రూ.2 వేలు, ఎల్ఈడీ స్క్రీన్‌కు సైజ్‌ను బట్టి ఒకరోజు కిరాయి రూ.5 వేల నుంచి 12 వేలు, వాహనంపై ఎల్ఈడీ అమర్చితే రూ.8 వేలు నుంచి 20 వేల వరకు చార్జీలు నిర్ణయించారు. వీడియోగ్రాఫర్ కెమెరాతో కలిపి నెలకు రూ 22,050, డ్రోన్ కెమెరాకు ఒక రోజు రూ3,500, ఆడియో క్యాసెట్ రికార్డు రూ 2,500, ఆటోతో రూ 3 వేలు, నలుగురైదుగురు కూర్చునే వేదిక రోజుకు రూ 150 నుంచి రూ 2800 వరకు ఉంది. క్లాత్ బ్యానర్లు ఫీట్లలో సైజ్‌ను బట్టి రూ. 9 నుంచి రూ 13 వరకు, ఫ్లెక్సీ బ్యానర్లు స్క్వేర్‌ఫీట్ రూ. 7 , హోర్డింగ్ ఫ్లెక్సీ రూ5 వేల నుంచి రూ 6వేల వరకు ధర నిర్ణయించారు.

ఒక బ్యాడ్జీ రేటు రూ 10, పోస్టర్లలో మల్టీకలర్ సంఖ్యను బట్టి రూ 8,500 నుంచి 75 వేలు , పూల దండ చిన్నది రూ 50, కలర్ పేపర్లతో రూ 150,పూలతో రూ 400 ,కరపత్రాలు ఇకటి రూపాయి,శాలువ రూ 50, ప్లకార్డులు రూ 25, జెండాలు రూ 5 నుంచి రూ 18 వరకు, డ్రైవర్‌తో కలిపి కారు, జీపు,టెంపో, ట్రక్, వాహనాల అద్దె రూ 2500, ఇన్నోవా,సూమో రూ. 3500, కారు రూ 2 వేలు, మూడు చక్రాల వాహనం రూ850, డిసిఎం వ్యాన్ రూ 3వేలు, మినీ బస్ 25 సీట్ల పరిమితి రూ4500, టాటా ఏసీ వాహనం రోజుకు రూ 1600, బొలెరో రూ 3000, డీలక్స్ రూ 2,200, సాధారణ గది రూ 1,200, ఏసీ ఫంక్షన్ హాల్ కుర్చీలతో అర్బన్‌లో రూ 15 వేలు, రూరల్‌లో ఏసీ ఫంక్షన్ హాల్ రూ 10 వేలు, అర్బన్‌లో ఏసీ లేని ఫంక్షన్ హాల్ రూ8 వేలు, రూరల్‌లో ఏసీ లేని ఫంక్షన్ హాల్ రూ 10 వేలు, టెంట్ బట్టి రూ800, సైడ్‌వాల్స్ రూ 30,కార్పెట్లు రెడ్ రూ 350,పెద్ద సైజ్ గ్రీన్ రూ 600 నిర్ణయించారు.

• చికెన్ బిర్యానీ రూ 100. మటన్ రూ. 120

లస్సీ, సాఫ్ట్ డ్రింక్ ఒకటి రూ 10, వాటర్ ప్యాకెట్ ఒక రూపాయి, వాటర్ బాటిల్ రూ 20, వాటర్ క్యాన్ 20లీటర్లు రూ10, టీ రూ 5, కాఫీ రూ 10, బ్రేక్ ఫాస్ట్ రూ 35, వెజిటేబుల్ ప్లేట్ భోజనం రూ.50, నాన్ వెజిటేబుల్ ప్లేట్ రూ. 100, చికెన్ బిర్యానీ రూ. 100, మటన్ బిర్యానీ రూ. 120, పెద్ద సమోసా ఒక టి రూ 6, చిన్న సమోసా రూ 2, ప్లేట్ మిర్చి, బజ్జీ, పకోడి రూ. 20, లెమన్ బియ్యం ప్లేట్ రూ.40 ధరలను నిర్ణయించారు. పంచాయతీ ఎన్నికల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, ప్రచా రానికి అభ్యర్థుల ఖర్చులపై కట్టుదిట్టమైన నిఘా ఏర్పాట్లు చేశారు.

కార్పొరేట్ కళాశాలల మోసం

గణేశ్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ ఇంటర్మీడియెట్ కళాశాలలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని జాతీయ బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ ఆరోపించారు. శనివారం తెలంగాణ ఇంటర్మీడియెట్ బోర్డుకార్యదర్శి శ్రీకృష్ణ ఆదిత్యకు ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ ముందస్తు అడ్మిషన్ల పేరిట దోపిడీ చేస్తున్నాయని, స్క్రీనింగ్‌టెస్టులు నిర్వహిస్తున్నాయని మండిపడ్డారు. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై ఆర్థికభారం మోపుతున్నాయన్నారు. ఒకే పేరుతో అనుమతి తీసుకొని దానికి అదనంగాబ్రాంచ్‌లు నడుపుతున్నాయ న్నారు. నిబంధనలు పాటించని కళాశాలల అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి శనివారం స్వల్పంగా నీరు వస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 1,338క్యూసెక్కుల వరదవచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి సరస్వతీ కాలువ ద్వారా 650 క్యూసెక్కులు, తాగు నీటి అవసరాల కోసం మిషన్ భగీరథ ద్వారా 231క్యూసెక్కులు, ఆవిరిరూపంలో 457 క్యూసెక్కుల నీరుపోతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 80.501 టీఎంసీలు కాగా అంతేస్థాయి నీటిమట్టంతో ప్రాజెక్టు నిండు కుండలా ఉంది. ప్రాజెక్టులోకి ఈ యేడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు 948.168 టీఎంసీల నీరు వచ్చిచేరగా, ప్రాజెక్టు నుంచి 880.455 టీఎంసీలనీరునుదిగువకు వదిలారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీరు

పోరాటాల ద్వారానే హక్కుల సాధన

- సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి

వేములవాడ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికుల పోరాటాల ద్వారానే హక్కులు సాధిస్తామని సీపీఐ జాతీయనాయకుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం వేములవాడ పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల మహాలింగేశ్వర ఫంక్షన్ హాల్‌లో రెండు రోజుల పాటు జరిగే ఏఐటి యూసీ అనుబంధమైన ఆల్ ఇండియా బీడీ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను ఏఐటీ యూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంటి బాలరాజు జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశంలోని 14రాష్ట్రాలలో బీడీపరిశ్రమల్లో 75లక్షలమంది బీడీ కార్మికులు పనిచేస్తున్నారన్నారు. బీడీ కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. 1965లో ఏఐటియూసి అనుబంధంగా బీడీవర్కర్స్ ఫెడరేషన్ కమిటీ ఏర్పాటైందన్నారు. అప్పటినుంచి అనేక ఐక్యఉద్యమాలు చేపడుతూ బీడీ కార్మికు లకు కనీస కూలీపెంపు, ప్రావిడెంట్ ఫండ్, బోనస్, సెలవు, పనిదినాలు, తదితర హక్కులు కాపాడుకోవటం కోసం పోరాటం చేశారన్నారు.

బీడీ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్న సందర్భంగా డిసెంబర్ 2వ వారంలో నిర్వహించే సేవ్ ఇండియా- సేవ్ బీడీ వర్కర్స్ నినాదంతో చలోఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బి గోవర్ధన్ మాట్లాడుతూ బీడీకార్మికులకు దేశవ్యాప్తంగా ఒకే వేతనం అమలుచేయాలన్నారు. ప్రతి వెయ్యి బీడీలకు రూ.300 ఇవ్వాలని, బీడీ పరిశ్రమలో కాంట్రాక్టు పద్ధతిని రద్దు చేయాలన్నారు. జాతీయ కౌన్సిల్ సమావేశంలో బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఇంచార్జి ఎస్. విలాస్, ఆల్ ఇండియా సిగార్, టొబాకో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్. కాశీవిశ్వనాథం, జాతీయ అధ్యక్షుడు కార్పర్ ఉగ్లే, జాతీయ ఉపాధ్యక్షులు నవాబ్, రాష్ట్ర బీడీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు, సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సుదర్శన్, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, బీడీ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కొక్కుల శాంత, అధ్యక్షులు కె. అనసూర్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు, నాయకులు దేవదాసు, లక్ష్మన్, పోచమల్లు, శాంత, రాధ, తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి, కొండగట్టుకు భక్తుల తాకిడి



ధర్మపురిలో అభిషేకాది పూజల్లో పాల్గొన్న భక్తులు



కొండగట్టు అంజన్న ఆలయ క్యూలైన్‌లో భక్తులు

ధర్మపురి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. భక్తులు కుంకుమార్చన, నరసింహహోమం, స్వామివారల నిత్య కల్యాణం జరిపించారు. యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనెపోసి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నాగదేవతకు, రావిచెట్టు, ఆంజనేయస్వామి వారికి అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు. స్వామివారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ పూజలు నిర్వహించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, భక్తులకు సేవలు అందించారు.

అంజన్న సన్నిధిలో..

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బేతాళుడు, శ్రీరాములవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

హాల్ టికెట్ల కోసం విద్యార్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

తిమ్మాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా విద్యార్థులకు ఫీజు చెల్లించాలని యాజమాన్యం హాల్‌టికెట్లను నిలిపివేసిందని శనివారం ఎస్ఎఫ్ఐ నాయకులు, కొందరు విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి కళాశాల ఆవరణలో ఆందోళన చేపట్టారు. దీంతో యాజమాన్యం విద్యార్థులకు హాల్ టికెట్లు ఇచ్చి పరీక్ష రాసేందుకు అనుమతి ఇవ్వడంతో వివాదం సద్దు మణిగింది. అంతకు ముందు తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలకు కౌన్సెలింగ్‌లో ఫ్రీసీటు వచ్చిందనిచెప్పడంతో చేర్పించామన్నారు. ఇప్పు డేమో ఫీజులు చెల్లించమంటున్నారని వాపోయారు.

అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ మాట్లాడుతూ తిమ్మాపూర్‌లోని వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా చదువుతున్న విద్యార్థులను ఫీజులు కట్టాలని వేధిస్తు న్నారని ఆరోపించారు. ఈ విషయంపై వాగేశ్వరి కళాశాల యాజమాన్యాన్ని వివరణ కోరగా 2024సెప్టెంబరులో విద్యార్థులు 30వేల ఫీజు చెల్లించాలని జీవో విడుదలైందని, దానిపై పూర్తి క్లారిటీ ఇవ్వలేదని తెలిపింది. ఈ ఏడాది బీసీ, ఓసీలు రూ.15వేలు ఫీజు చెల్లించే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొంది.దీంతో కళాశాల ఫీజు రూ.15వేలు, యూనివర్సిటీ ఫీజు రూ.2100 మొత్తం రూ.17100 చెల్లించాలని 20రోజుల క్రితమే విద్యార్థులకు సమాచారమిచ్చామన్నారు. పరీక్షలు రాయకుండా విద్యార్థులను ఇబ్బంది పెట్టేందుకు హాల్ టికెట్‌లను నిలిపివేయలేదని, ఇంకా సమయం ఉందని ఆలోపు హాల్ టికెట్‌లను ఇచ్చే వారిమని తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు అసంపల్లి వినయ్‌సాగర్, జిల్లాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన ఉమ్మడిజిల్లా వాలీబాల్ శిక్షణ శిబిరం



శిక్షణ శిబిరంలో ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలబాలికల శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈనెల 24న జిల్లాకేంద్రంలోని మినీస్టేడియంలో అసోసి యేషన్ బాలబాలికల జట్లకు ప్రత్యేకంగా శిక్షణ శిబిరాన్ని ఏర్పాటుచేసింది. శిక్షణ శిబిరానికి ఉమ్మడి కరీంనగర్‌జిల్లా నుంచి బాలురజట్టులో 16మంది, బాలికలజట్టులో 16మంది క్రీడాకారులను ఎంపికచేశారు. వీరికివసతి కల్పించి ఉదయం, సాయంత్రం వాలీబాల్ కోచ్‌లు సంపత్‌కుమార్, జగన్ పర్యవేక్షణలో శిక్షణ ఇప్పించారు.

• నేటి నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు..

జిల్లాకేంద్రం మినీస్టేడియంలో ఆదివారం నుంచి జరుగనున్న 8వతెలంగాణ రాష్ట్రస్థాయి జూని యర్స్ వాలీబాల్ పోటీలకు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. నాలుగు వాలీబాల్ కోర్టులను సిద్ధం చేశారు. రాత్రిసమయంలో వాలీబాల్ పోటీలకు ఆటకం లేకుండా లేకుండా ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో 10బాలురు జట్లు, 10బాలికలజట్లు పాల్గొంటున్నాయి. పోటీలలో పాల్గొంటున్న బాలబాలికలు 240,దాదాపు 50మంది అఫీషియల్స్‌కు స్టేడియం సమీపంలో వసతి సౌకర్యం కల్పించారు.

ఆల్ ఇండియా పోలీస్ మీట్‌కు వినీత్



వినీత్

హుజూరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన హాకీ క్రీడాకారుడు మోటపోతుల వినీత్ ఆల్ ఇండియా హాకీ పోలీస్ మీట్‌కు ఎంపికయ్యాడు. డిసెంబరు 4నుంచి 15వరకు గుజరాత్ రాజకోట్‌లో మీట్ నిర్వహించనున్నారు. వినీత్ హైదరాబాద్‌లో స్పెషల్ అర్మడ్ రిజర్వు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ సందర్భంగా హుజూరాబాద్ హాకీ క్లబ్ అధ్యక్షుడు తోట రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు బండ శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, బొడిగె తిరుపతి, శంకర్, శ్యామ్, సజ్జు, సాయికృష్ణ, విక్రమ్, సాంబరాజు, వంశీ, వినయ్, పరబ్రహ్మం హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పెద్దపల్లి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్స్ ఖోఖోపోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు మండలంలోని నిట్టూరు పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులో ఈనెల 28నుంచి 30తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాఠశాలలో చదు వుతున్న టీనా, బాలసాని సిరి, భూషనవేణి వినయ్, సాగలసంజయ్‌లు పాల్గొంటున్నట్లు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

గంగాధర : గంగాధర మోడల్‌స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ నాగరాజు తెలిపారు. పాఠశాలకు చెందిన అక్షయ, అర్చన, సాన్విత ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ప్రిన్సిపాల్ పద్మ, పీఈటీ నాగరాజు అభినందించారు.



ఎంపికైన నిట్టూరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పద్మ

(5వ పేజీ తరువాయి)

లేవని చావుకబురు చల్లగా చెప్పింది. బడ్జెట్ రిలీజ్ చేయక, ఫ్రీజింగ్ విధించడతో రెండేళ్లగా మాజీ సర్పంచులు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. పదవీ కాలం పూర్తయి తాజా ఎన్నికలు వచ్చినా నిధుల విడుదలకు మోక్షం లభించలేదు. పనులు రికార్డు అయి ట్రెజరీలకు బిల్లులు వెళ్లినా డబ్బులు అందలేదు. మంత్రులు, ఎమ్మెల్యేల హామీతో నిధులు మంజూరు కాకున్నా కొంతమంది పనులు పూర్తి చేశారు. ఆ పనులను బిల్లు రికార్డు చేసే అవకాశం లేకపోవడంతో వారికి డబ్బు వచ్చే అవకాశమే లేకుండా పోయింది. పదవీకాలం పూర్తవడంతో ఆయా పనులపై పెట్టిన డబ్బుకు తిలోదకాలు ఇచ్చుకోవలసిన పరిస్థితి ఏర్పడింది.

సర్పంచ్‌లుగా చేసి సర్వం కోల్పోయాం

● రూ. 20 లక్షల వరకు అప్పు అయ్యింది

- పాడిగా పద్మజ, మాజీ సర్పంచ్, వెంకటేశ్వరపల్లి

సర్పంచ్‌గా గెలిచిన తర్వాత పలు అభివృద్ధి పనులు చేశా.. 20 లక్షల వరకు అప్పు అయ్యిం ది. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలి.

● బిల్లులు రాక ప్రైవేట్‌గా పని చేసుకుంటున్నా



- చెప్యాల మమత, మాజీ సర్పంచ్ ఉల్లంపల్లి.

ప్రభుత్వం పెండింగ్ బిల్లులు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.. కరీంనగర్‌లో ప్రైవేట్‌గా పని చేసుకుంటున్నా; వెంటనే పెండింగ్ బిల్లులు ఇవ్వాలి.

● పనులు చేసినా పైసలు ఇవ్వలేదు

- మొరె అనూష, మాజీ సర్పంచ్, మొలంగూర్



సర్పంచ్‌గా చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ఇవ్వలేదు. 32 లక్షల వరకు నిధులు రావాలి. మిషన్ భగీరథ, రైతువేదిక, స్కూల్ బిల్డింగ్‌కు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నవి. వెంటనే వాటిని మంజూరు చేయాలి

● రూ.1.45 కోట్లు పెండింగ్ ఉన్నాయి

- రొడ్డ పృథ్వీరాజ్, మాజీ సర్పంచ్, మానకొండూరు



గ్రామంలో చేసిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన దాదాపు కోటి 45 లక్షల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో కోటి 5 లక్షలు ఎంబీ రికార్డు కాగా, 40 లక్షలు ఇంకా రికార్డు కాలేదు. అన్ని బిల్లులు చెల్లించాలి.

● అంతా అయోమయంగా ఉంది

- పుల్లెల లక్ష్మి లక్ష్మణ్, మాజీ సర్పంచ్, గన్నేరువరం



పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని అయోమయంగా ఉంది. సొంత నిధులతో గ్రామ అభి వృద్ధి పనులు చేశాం. 32 లక్షల బిల్లులు రావలసి ఉంది.

● వడ్డీలతో ఇబ్బంది

- పోతుల నరసయ్య, మాజీ సర్పంచ్, రెడ్డిపల్లి



సర్పంచ్‌గా గెలిచిన తర్వాత చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి 80 లక్షల బిల్లులు రావలసి ఉంది. ఈ పనులు పూర్తిచేసేందుకు తెచ్చిన అప్పులు, వాటి వడ్డీలు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నా... ప్రభుత్వం స్పందించి బిల్లులు చెల్లించాలి.

● భూమి కుదవపెట్టి పనులు చేశా..



- ఉప్పులేటి ఉమారాణి, మాజీ సర్పంచ్, వచ్చునూరు

భూమి కుదవపెట్టి రూ.10 లక్షలు అప్పు తీసుకొచ్చి గ్రామంలో అభివృద్ధి పనులు చేశా. ఆరు నెలలకోసారి వడ్డీ చెల్లిస్తున్నా. మూడేళ్ల క్రితం ట్రెజరీలో వేసిన చెక్కు పాస్ కాలేదు. కొన్ని బిల్లులు ఎంబీ రికార్డు అయినా ఇవ్వలేదు. ఇబ్బంది పెట్టకుండా బిల్లులు మంజూరు చేస్తే చాలు.

● రెండు ఎకరాల భూమిని పోగొట్టుకున్నా



- ఎనగందుల సుదర్శన్, మాజీ సర్పంచ్, ఊటూరు

సొంత డబ్బులతో పలు అభివృద్ధి పనులు చేశా. నాకు 20 లక్షల బిల్లులు రావాలి. గ్రామంలో పనులు చేసేందుకు రెండెకరాల ఎనిమిది గుంటల వ్యవసాయ భూమిని అమ్ముకున్నా. తిరిగి సర్పంచ్ పదవికి పోటీ చేయాలని ఉన్నా గతంలో బిల్లులు రాక అప్పులు, వడ్డీ చెల్లించలేకనే ఇబ్బందులు పడుతున్నా.. ప్రభుత్వం స్పందించాలి

● భూమిని అమ్ముకోవడం బాధగా ఉంది.

- రేగుల సుమలత, మాజీ సర్పంచ్, రాంచంద్రాపూర్



సర్పంచ్‌గా అప్పులు చేసి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టా. బిల్లులు రాక అప్పులు పెరిగిపోయాయి. తీర్చేందుకు రెండెకరాల భూమి అమ్ముకున్నా. సర్పంచ్‌గా పని చేశానన్న సంతోషం కన్నా భూమి అమ్ముకోవడం బాధగా ఉంది. 10 లక్షల వరకు పెండింగ్ బిల్లులు రావలసి ఉంది.

● హైకోర్టు తీర్పును పట్టించుకోని ప్రభుత్వం

- దామెర విద్యాసాగర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, ఆర్నకొండ



మా బిల్లులు ఇచ్చాక కొత్త సర్పంచులు పనులు చేయాలి. రూ.28 లక్షల బిల్లులు రావాలి. అందులో 14 లక్షల పనుల ఎంబీ రికార్డు పూర్తయ్యింది. మిగిలినవి రికార్డు చేయలేదు. పెండింగ్ డబ్బులను చెల్లించాలని హైకోర్టు తీర్పు ఇచ్చినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

● రూ.27 లక్షల బిల్లులు రావాలి..

- కరుణాకర్, మాజీ సర్పంచ్, రంగాపూర్



హుజూరాబాద్ మండలంలోని రంగాపూర్ సర్పంచ్‌గా రెండు కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేశాను. రూ.27 లక్షల బిల్లులు రావాలి. గ్రామపంచాయతీలో నిధులు లేక చెక్కులు క్లియర్ కాలేదు. ఎన్నికలు పూర్తయిన తర్వాతనైనా బిల్లులు ఇవ్వాలి. లేకుంటే కోర్టును ఆశ్రయిస్తాం.

● బిల్లులు రాకుంటే అగమ్య గోచరమే

- కంది దిలీప్‌రెడ్డి, మాజీ సర్పంచ్, వంతడపుల



గ్రామ అభివృద్ధి కోసం అప్పులు తీసుకొచ్చి పనులు పూర్తి చేశాం. 13 లక్షల రూపాయల బిల్లులు రావాలి. మా బిల్లుల పరిస్థితిపై ప్రభుత్వం ఆలోచించాలి. ఎకరం భూమి అమ్మి అప్పులు తీర్చాను. ఇబ్బందులు పడుతున్నాం. బిల్లులు రాకుంటే మా పరిస్థితి అగమ్యగోచరమే.

● సంక్షిప్తంగా..

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ శనివారం నగరంలోని పలు కుల సంఘాల జిల్లా అధ్యక్షులను ఆయా కార్యాలయాల్లో మర్యాద పూర్వకంగా కలిశారు. తన నియామకానికి పరోక్షంగా, ప్రత్యక్షంగా సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు రుణపడి ఉంటానని అంజన్ కుమార్ తెలిపారు.

మానకొండూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గుగ్గిల్లపు రమేశ్ పిలుపునిచ్చారు. మానకొండూర్‌లో శనివారం మండల పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కేంద్రప్రభుత్వ ప్రథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

గణేశ్‌నగర్: శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల స్వయం ప్రతిపత్తి వృక్షశాస్త్ర విభాగ సహాయ ఆచార్యుడు, సూక్ష్మజీవ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రౌతు రాధాకృష్ణ పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు.

గణేశ్‌నగర్: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం అకడమిక్ ఆడిట్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.వరలక్ష్మి తెలిపారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, హైదరాబాద్ బృందం పరిశీలించినట్లు పేర్కొన్నారు.

సుభాష్‌నగర్: అలయన్స్‌క్లబ్, వాసుదేవ ఆసుపత్రి, సిద్ధి ఐ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నగరంలోని అచీవర్స్ పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వాసుదేవ ఆసుపత్రి చైర్మెన్ డాక్టర్ శ్రీనివాస్ పరీక్షించారు. క్లబ్ జిల్లా గవర్నర్ చెరిమల వెంకటేశ్వర్లు, డాక్టర్ వై జ్యోతి, కోల అన్నారెడ్డి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య అధ్యక్షతన శనివారం మహిళలపై జరుగుతున్న హింస, బాల్య వివాహలపై మహిళా శిశు సంక్షేమ శాఖాధికారులు శిక్షణ నిర్వహించారు.

వీణవంక: మండల కేంద్రంలోని రెడ్డిరాజుల ఓదెలు మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పాడి కౌషిక్‌రెడ్డి శనివారం పరామర్శించారు.

వీణవంక: మల్లారెడ్డిపల్లికి చెందిన శనిగరం మల్లయ్య మృతి చెందగా బాధిత కుటుంబానికి మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి దహన సంస్కారలకు రూ.5000 అందజేశారు. నాయకులు కిరణ్, దూలం సమ్మయ్య, సమ్మయ్య సమ్మయ్య, చంద్రయ్య ఉన్నారు.

కరీంనగర్ టౌన్: నగరంలోని 47వ డివిజన్ పరిధిలో రోడ్డును ఆక్రమించి చెట్లు పెంచుతున్నారని వాటిని తొలగించాలని ఖాలిద్ శనివారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందచేశారు.

కరీంనగర్ కల్చరల్: భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన ఆదివారం వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో గౌరై శ్యామల రచించిన 'అక్షరమా నీకు వందనం', 'అనుభవం నేర్పిన పాఠం' పుస్తకాలను ఆవిష్కరించనున్నట్లు ఇటిక్యాల రాము ఒక ప్రకటనలో తెలిపారు.

మానకొండూర్: విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత మనోహరచారి సూచించారు. మానకొండూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో మాట్లాడారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

సుభాష్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను పెంచాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. శనివారం వైద్యఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానల మెడికల్ ఆఫీసర్లు, ఎంఎల్‌హెచ్‌పీలతో అసంక్రమిత వ్యాధులు(ఎన్‌సీడీ), మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమాశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు పాల్గొన్నారు.

సీవీఎంలో ఉచిత మెగా వైద్య శిబిరం

సుభాష్‌నగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సీవీఎం ఆసుపత్రి 6వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ చాట్ల శ్రీధర్ తెలిపారు. శనివారం ఆసుపత్రిలో 6వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిని ఏర్పాటు చేసి ఆరేళ్లు పూర్తయ్యాయన్నారు. కరోనా సమయంలో ఉత్తర తెలంగాణలో మొట్టమొదట వేలాది మందికి చికిత్స అందించినట్లు చెప్పారు. ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. వార్షికోత్సవం సందర్భంగా ఆరు రోజులపాటు మెగా హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నామని, బీపీ, షుగర్ పేషంట్లకు రక్త పరీక్షలు, ఈసీజీ, లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలు ఉచితంగా చేస్తామని, డాక్టర్ కన్సల్టెంట్ ఉచితమని తెలిపారు. ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ చాట్ల సునీత, డాక్టర్ అనుదీప్ బచ్చు పాల్గొన్నారు.



జ్ఞాపిక అందజేస్తున్న సీవీఎం ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ చాట్ల శ్రీధర్

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



ఎమ్మెల్యేతో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

తిమ్మాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట మండలం పత్తికుంటపల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మండలంలోని ఎల్ఎండీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జుట్టు భాస్కర్, శేఖర్, మధు, నరేష్, అశోక్, రవి, రాజు, వినోద్, పర్శరాములు, అభిలాష్ ఉన్నారు. కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం మండలంలో బొమ్మనపల్లి, ఉల్లంపల్లి నుంచి ప్రజలు, బీఆర్ఎస్ నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరారు. మాజీ జడ్పీటీసీ గీకురు రవీందర్, దేవెందర్‌రెడ్డి, అదర్శ్, శ్రీనివాస్, దేవేందర్ పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్య కోసం పోరాటం చేయాలి

భగత్‌నగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్రీయ విద్య కోసం పోరాటాలు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నంది రామయ్య అన్నారు. శనివారం నగరంలోని ఉర్దూభవన్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా 23వ మహాసభలో మాట్లాడారు. అశాస్త్రీయ విద్యావిధానంతో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. రైతులు, మహిళలకు జరిగిన అన్యాయాలను ఎప్పకటిప్పుడు ఖండించాలన్నారు. నేటి విద్యా వ్యవస్థలో స్వతంత్రంగా ఆలోచించకుండా కేవలం పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతోందన్నారు. ఇలాంటి విద్యావ్యవస్థ సమాజాన్ని అభివృద్ధి చెందనీయదన్నారు. అశాస్త్రీయ విద్యను వ్యతిరేకించాలని, నూతన శాస్త్రీయ విద్య, శ్రమను గౌరవించే విద్య కావాలని పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ, కార్యదర్శి అనిల్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్, ధీరజ్, కాగితపు పల్లవి, చిలుక శ్రీవాణి, తాళ్లపల్లి అంజి, విష్ణు, అశోక్, వైష్ణవి, వెన్నెల దుగ్యాల సందీప్, కేతిరి అరుణ్ పాల్గొన్నారు.

విద్యార్థుల నమోదు శాతం పెంచాలి

జమ్మికుంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కళాశాలలో విద్యార్థుల నమోదు శాతం పెంచాలని కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ అన్నారు. శనివారం జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల నమోదు శాతం పెంచడంతో పాటు అధ్యాపకులు మరిన్ని పరిశోధనలు చేయాలన్నారు.

జీవో 46పై భగ్గుమన్న బీజేపీ శ్రేణులు

గణేశ్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 46పై కరీంనగర్ బీజేపీ శ్రేణులు భగ్గుమన్నాయి. రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు అడిచర్ల రాజు ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ చౌక్‌లో జీవో ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిల్లపు రమేష్, మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ వాగ్దానాలు నీటి మూటలేనని స్పష్టంగా బీసీ సమాజానికి అర్థమైందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పేరిట కాంగ్రెస్ ఇన్నాళ్లు రాజకీయ డ్రామాలు చేసిందని, నేడు జీవో 46తో బీసీలకు రిజర్వేషన్లను తగ్గించి మోసం చేసిందని అన్నారు. నాయకులు శ్రీనివాస్, రమణారెడ్డి, ప్రకాష్, నరహరి లక్ష్మారెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

చివరి రోజు నామినేషన్ల జోరు

కరీంనగర్ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచయాతీ ఎన్నికల్లో భాగంగా మూడో రోజు చివరి రోజైన శనివారం నామినేషన్ల జోరు సాగింది. కరీంనగర్ రూరల్ మండలంలో చివరి రోజు మొత్తం 14 సర్పంచ్ స్థానాలకు 67, 132 వార్డు సభ్యులకు 286 మంది నామినేషన్లు దాఖలు అయ్యాయి. సర్పంచ్ స్థానాలకు మొత్తం 97, వార్డులకు 346 మంది నామినేషన్లు వేశారు.

డిగ్రీ విద్యార్థి నామినేషన్

చెర్లబూత్కూర్‌లో బీకామ్ ఫైనల్ ఈయర్ చదువుతున్న మాడిశెట్టి అఖిల్ సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేశాడు.

గంగాధర: మండలంలో 33 గ్రామాలకు 266, 296 వార్డు స్థానాలకు 725 నామినేషన్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. బూరుగుపల్లి మరో రెండు గ్రామాల్లో రాత్రి 9:30 గంటల వరకు ప్రక్రియ కొనసాగింది.

రేపు గీతాజయంతి

కరీంనగర్ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మార్గశిర శుద్ధ ఏకాదశి సందర్భంగా సోమవారం గీతాజయంతి నిర్వహించనున్నారు. దీనినే మోక్షదా ఏకాదశి అని పిలుస్తారు. విష్ణువుకు ప్రీతికరమైన ఏకాదశిలలో దీన్ని మహిమాన్విత ఏకాదశిగా పురాణాలు వర్ణించాయి. ఈ రోజున ఉపవాసం, విష్ణు ఆరాధన విశేష ఫలితాలను ప్రసాదిస్తుందని, మోక్షప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఇదే రోజున శ్రీకృష్ణుడు కురుక్షేత్రంలో అర్జునుడికి భగవద్గీతను బోధించాడని పురాణాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా నగరంలోని అన్ని ఆలయాల్లో భగవద్గీత పారాయణాలు, హోమాలు చేపట్టనున్నారు.

కేంద్రం నిధులతోనే అభివృద్ధి

వీణవంక,నవంబరు29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి చెందుతున్నాయని బీజేపీ నాయకుడు కరీంనగర్ మాజీ మేయర్ సునీల్ రావు అన్నారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ మద్దతు దారులను గెలిపించాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు బత్తిని నరేష్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: దేశ వ్యాప్తంగా గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ మద్దతుదారులను సర్పంచులుగా గెలిపించాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమిటి రాంగోపాల్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్ కుమార్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పొన్నం శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో ఎంబీఏ విద్యార్థులకు ముగిసిన శిక్షణ

తిమ్మాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచైతన్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాజికల్ సైన్స్ కళాశాలలో వారం రోజుల నుంచి ఎంబీఏ విద్యార్థులకు నిర్వహిస్తున్న శిక్షణ శనివారం ముగిసినట్లు విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి తెలిపారు. ఇటంర్వ్యూ స్కిల్స్, లైఫ్ స్కిల్స్‌పై రిలైయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వ హించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు లీడర్ షిప్ స్కిల్స్‌లో నైపుణ్యం సంపాదించాలన్నారు. డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసాద్ రాజు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

సీఐటీయూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

భగత్‌నగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర ఐదో మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి గీట్ల ముకుందరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నగరంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ డిసెంబరు 7, 8, 9 తేదీల్లో మెదక్‌లో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మరిన్ని సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఎడ్ల రమేష్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యంకు శుభాకాంక్షలు

కరీంనగర్ అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియామకమైన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం కరీంనగర్‌లోని మేడిపల్లి సత్యం నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

రేపు జాబ్ మేళా

సుభాష్‌నగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): యాడ్ ఎన్‌జీవో ఆధ్వర్యంలో సోమవారం నగరంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎన్‌జీవో వ్యవ స్థాపకుడు కొంకటి రవి తెలిపారు. స్థానిక మురంపురలో గల ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో రెటైల్ స్పార్క్, యూత్ యాక్షన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ భాగస్వామ్యంతో మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9441800040 నంబరులో సంప్రదించాలని సూచించారు.

సంక్షేమం, అభివృద్ధికి పట్టం కట్టనున్న ప్రజలు

గంగాధర, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధికి ప్రజలు పట్టం కట్టబోతున్నారని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. శనివారం కురిక్యాల తాజామాజీ ఉపసర్పంచ్ కడారి కనుకయ్య బీఆర్ఎస్ నుంచి 200 మందితో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్లలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో గతంలో జరగని అభివృద్ధి ఇప్పుడు చేస్తున్నామని, అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఏఎంసీ చైర్మన్ జాగిరపు రజితశ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిరుమల్‌రావు, పార్టీ మండలాధ్యక్షుడు మనోహర్ పాల్గొన్నారు.

ఉజ్వల పార్క్‌ను సందర్శించిన అచీవర్స్ విద్యార్థులు

గణేశ్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోతి రాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలకు చెందిన ఒకటి, రెండో తరగతుల విద్యార్థులు క్షేత్రస్థాయి సందర్శనలో భాగంగా శనివారం ఉజ్వల పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా మొక్కలు, ప్రకృతిపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ పల్లవి, డైరెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అధికారులకు పదవీ విరమణ సన్మానం

కరీంనగర్ క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలం సేవలందించిన ఇద్దరు పోలీసు అధికారుల పదవీ విరమణ సందర్భంగా శనివారం కార్యాలయంలో సన్మానించారు. ఆర్ఎస్ఐ కాంతయ్య ఏఆర్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ విభాగం నుంచి, ఎస్ఐ అజ్మత్ కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి పదవీ విరమణ పొందారు. అడిషనల్ డీసీపీ భీంరావు వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, కరీంనగర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎస్సై మామిడాల సురేందర్ పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ సఫారీకి ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ సఫారీకి జిల్లాకు చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు బాషపత్తిని ఓదెలు కుమార్ ఎంపికయ్యారు. పంజాబ్‌లోని ఛండీఘర్‌లో వచ్చే నెల 6 నుంచి 9 వరకు జరగనున్న భారతదేశపు మెగా సైన్స్ ఫెస్టివల్ జరగనుంది. ఓదెలు కుమార్ జిల్లాలోని చిగురుమామిడి మండలం ఇందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఓదెలు కుమార్‌ను డీఈవో శ్రీరాం మొండయ్య, ప్రధానోపాధ్యాయని జయప్రద, జిల్లా సైన్స్ ఆఫీసర్ జయపాల్ రెడ్డి, అశోక్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్, ఎంఈవో పావని అభినందించారు.

హుజూరాబాద్ ఎంఈవోపై ఆర్‌జేడీకి ఫిర్యాదు

హుజూరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఎంఈవోపై ఆలిండియా స్టూడెంట్స్ బ్లాక్ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ మెంబర్ సూర్యకిరణ్ శనివారం ఆర్‌జేడీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుజూరాబాద్ ఎంఈవో తన కార్యాలయ అవసరాల కోసం ప్రభుత్వ ఉపాధ్యాయుడిని నియమించుకొని, విద్యార్థులకు పాఠాలు చెప్పడం లేదన్నారు. డిప్యూటేషన్ పేరిట ఎంఈవో కార్యాలయంలో విధుల పేరిట టైంపాస్ చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఎంఈవో, ఉపాధ్యాయుడు గోపాల్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

మార్కండేయ స్వామి మాలధారణ దీక్ష ప్రచార కార్యక్రమం

హుజూరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని చేనేత సహకార సంఘం కార్యాలయంలో శనివారం అఖిల భారత పద్మశాలి పురోహిత సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ స్వామి మాలధారణ దీక్ష ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి చిలుక నరసప్ప మాట్లాడుతూ డిసెంబరు 10న ప్రారంభమయ్యే మార్కండేయ స్వామి మాలధారణ దీక్ష జనవరి 21, 2026న స్వామి జన్మదిన సందర్భంగా జరగబోయే రథయాత్రతో ముగుస్తుందన్నారు. చేనేత సంఘం అధ్యక్షుడు ఎలిగేటి ఉపేందర్, ఉపాధ్యక్షుడు వేముల యాదగిరి పాల్గొన్నారు.

పాఠశాలలో వింటర్ డే

హుజూరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని శస్త్ర పబ్లిక్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం వింటర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వేణుమాధవ్ మాట్లాడుతూ విద్యార్థులు చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. జలుబు, గొంతు పట్టేయడం వంటి బారిన పడకుండా చూసుకోవాలన్నారు. ప్రతిరోజు వ్యాయామం అవసరమన్నారు. చలిని తట్టుకునేలా దుస్తులు ధరించాలన్నారు. ప్రిన్సిపాల్ ముంజాల సంగీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తండ్రీకొడుకుల నామినేషన్

గంగాధర,నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గంగాధర మండలంలో పంచాయతీ ఎన్నికల్లో తండ్రీకొడుకులు సర్పంచ్ పదవికి నామినేషన్ వేశారు. లక్ష్మీదేవిపల్లి సర్పంచ్ స్థానం జనరల్‌కు కేటాంచారు. దీంతో గ్రామంలోని గుజ్జుల బాపురెడ్డి, ఆయన కుమారుడు గుజ్జుల రమణ శనివారం నామినేషన్లు వేశారు. వీరితో పాటు 8 మంది నామినేషన్లు వేశారు. గ్రామంలోని రెండు వార్డులకు ఒక్కొక్కరు నామినేషన్ దాఖలు చేశారు. గ్రామంలోని 6వ వార్డు బీసీ మహిళకాగా ఇప్పలపెల్లి అరుణ, 10వ వార్డు జనరల్ కాగా ఇందులో బీసీ అభ్యర్థిగా పొన్నాల శ్రీనివాస్ ఒక్కరేనామినేషన్ వేశారు. దీంతో రెండు వార్డులు ఏకగ్రీవం కానున్నాయి.

చెకుముకి పోటీల విజేతలకు బహుమతులు

కరీంనగర్ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ విజేతలకు శనివారం బహుమతులను ప్రదానం చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఓల్డ్‌లో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ప్రభుత్వ పాఠశాలల విభాగం నుంచి ఎస్.అర్చన, ఎం.సుష్మిత, సానియా (జడ్పీహెచ్ఎస్, మల్కాపూర్), కొత్తపల్లి మండలం ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల విభాగం నుంచి జి.హర్షిత్, ఎం.అజయ్, ఆర్.స్మార్ట్ తెలంగాణ సాంఘిక సంక్షేమ సైనిక్ స్కూల్ రుక్మాపూర్, ప్రైవేట్ పాఠశాలల విభాగం నుంచి కెఎం కార్తికేయ, శివరాత్రి రిశాల్, ఓ.శివస్మరన్‌రెడ్డి ఆల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్ కొత్తపల్లి, ప్రభుత్వ తెలుగు మీడియా పాఠశాలల విభాగం నుంచి జి.అంజలి, పి.సంజన, బి.వైష్ణవి ప్రభుత్వ ఉన్నత పాఠశాల సవరాన్, కోతిరాంపూర్ ఎంపికయ్యారు. జడ్పీసీఈవో శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి దేవేందర్ రామరాజు పాల్గొన్నారు.

డీసీసీ మెడికల్ వింగ్ చైర్మన్‌గా డాక్టర్ వెంకటేశ్వర్లు

కరీంనగర్ అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ కమిటీ డాక్టర్ సెల్ మెడికల్ అండ్ హెల్త్ వింగ్ చైర్మన్‌గా కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ ఫిజీషియన్ వెంకటేశ్వర్లును నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.